క్లుప్తంగా

రేపు భట్టిప్రోలులో గీతా జయంతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఈ నెల 11వ తేదీన 50వ వార్షికోత్సవం, గీతా జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు బుర్లె అరుణ కుమారి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సాధన మండలిలో శ్రీ మద్భగవద్గీత పారాయణ, కర్పూర యజ్ఞం, ఆధ్యాత్మిక ప్రవచనాలు వంటి కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

హైందవ శంఖారావం సభ విజయవంతం చేయాలి



రేపల్లె రూరల్: విజయవాడలో జనవరి 5వ తేదీన జరుగనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పిలుపునిచ్చారు. రేపల్లె పట్టణం, నిజాంపట్నంలో సోమవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం, దేవాలయాల రక్షణ, హిందువుల ఐక్యత కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5వ తేదీన జరుగుతున్న హైందవ శంఖారావం సభ విజయవంతం అవటానికి ప్రతి ఒక్కరూ రావాలని కోరారు. డిసెంబర్ 11వ తేదీన గీతా జయంతి జరుపుకోవాలన్నారు. ప్రపంచ మానవాళికి మార్గదర్శిని లాంటి భగవద్గీత పుట్టిన రోజున హైందవ శంఖారావం విజయవంతం కావాలని దేవాలయాల్లో సామూహిక హారతులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ కాశేపల్లి గౌరీశంకర్, మహిళా కన్వీనర్ కొండూరి సుగుణార్థిని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు 5 అర్జీలు

రేపల్లె రూరల్: సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. రిజిస్ట్రేషన్ పట్టాలు అందించాలంటూ 2, ఆక్రమణకు గురైన నివేసన స్థలాన్ని సర్వే చేయించి అందించాలని కోరుతూ 1, భూమి ఆన్‌లైన్ చేయాలని 2 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. అర్జీలను పరిశీలించి ఆయా శాఖల అధికారులచే పరిష్కరించబడునని పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావుకు జిల్లా ఎన్నికల అధికారి నంబూరు నాగభూషణరావు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా, వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కురాళ్ల రవి కుమార్, ఆలపాటి ఉపేంద్ర పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఖాజీపాలెం(కర్లపాలెం): సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కేసులు పెడతామని చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ చెప్పారు. ఖాజీపాలెంలో సోమవారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. పండుగల సమయంలో పేకాటలు, కోడి పందేలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.

నిత్యావసరాలు పంపిణీ



తెనాలిఅర్బన్: అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి గ్రస్తులకు సోమవారం గాంధీచౌక్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ దంపతుల చేతుల మీదుగా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ మాట్లాడుతూ క్షయవ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

'బెల్టు' తీయరు.. పట్టించుకోరు

- గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా బెల్టు షాపుల నిర్వహణ
- తూతూ మంత్రంగా అధికారుల చర్యలు
- గ్రామానికి రెండు నుంచి ఐదు షాపులు
- మొబైల్ షాపులూ కొనసాగుతున్న వైనం



కూచిపూడిలోని మద్యం షాపు

వేమూరు: మద్యం బెల్టు షాపుల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం బెల్టు షాపులు నిర్వహించరాదని ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మద్యం షాపుల నిర్వాహకులు బెల్టు షాపులు నిర్వహించరాదని ఎక్సైజ్ అధికారులు షాపుల నిర్వాహకులకు చెప్పారు. అయితే షాపుల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలు తుంగలో తొక్కి బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటే కూటమి నాయకులు ఫోన్‌లు చేస్తున్నారని అధికారుల మధ్య గుసగుసలు వినపడుతున్నాయి.

గ్రామానికి రెండు నుంచి ఐదు షాపులు

గత ప్రభుత్వం మద్యంలో కొత్త పాలసీ తీసుకొని వచ్చి మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించింది. బెల్టు షాపులు లేకుండా మద్యం షాపులు కొనసాగించింది. గత ప్రభుత్వంలో బెల్టు షాపులు నిర్వహించేందుకు షాపుల నిర్వాహకులు భయపడ్డారు. కూటమి ప్రభుత్వంలో గ్రామానికి రెండు లేదా ఐదు బెల్టు షాపులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూటిమి నాయకుల ప్రభావం వల్ల ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపుల నిర్వాహకులపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఒక్క మండలంలోనే 35 షాపులు

వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో మద్యం షాపులు కొనసాగుతున్నాయి. ప్రతి మద్యం షాపు ద్వారా బెల్టు షాపులు కొనసాగుతున్నా అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అమర్తలూరు మండలంలో రెండు మద్యం షాపులు కొనసాగుతున్నాయి. ఈ రెండు షాపుల ద్వారా 35 బెల్టు షాపులు కొనసాగుతున్నాయి. ఇంటూరు గ్రామంలో 5 బెల్టు షాపులు, ప్యాపర్రులో-3, మోపర్రు-3, యలవర్రు-3, గోవాడ-2, బోడపాడు-3, తురిమిళ్లలో-3, మూల్పూరు-3, పెదపూడి-3, పాంచాళవరం-2, యలవర్రు-3, యడపూరులో-2 బెల్టు షాపులు కొనసాగిస్తున్నారు. ఈ బెల్టు షాపుల నిర్వాహకులపై అధికారులు ఇంత వరకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని చోట్ల మొబైల్ బెల్టు షాపుల విధానం కొనసాగుతుందని గ్రామస్తులు తెలుపుతున్నారు.

నివారణకు చర్యలు తీసుకోవాలి



గ్రామీణ ప్రాంతంలో బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం బెల్టు షాపులు కొనసాగించరాదని చెబుతున్నా కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు బెల్టు షాపులు కొనసాగిస్తున్నారు. అధికారులు బెల్టు షాపుల నివారణపై చర్యలు తీసుకోవాలి.

– బొనిగల అగస్టీన్, సీపీఎం కార్యదర్శి, వేమూరు

మొబైల్ షాపులు కొనసాగుతున్నాయి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొబైల్ బెల్టు షాపులు విధానం వచ్చింది. బెల్టు షాపుల నిర్వాహకులు ఎవరైనా ఫోన్ చేసినా స్కూటీలో మద్యం సీసాలు తీసుకొని వెళ్లి అందించడం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక బెల్టు షాపులకు అంతం లేకుండా పోయింది.

– అలపర్తి రవి కుమార్, జంపని

చర్యలు తీసుకుంటాం



అమర్తలూరు మండలంలో మద్యం బెల్టు షాపుల వ్యవహారం దృష్టికి వచ్చింది. పలు సార్లు బెల్టు షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నం చేసినా దొరక లేదు. బెల్టు షాపుల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– రవి కుమార్, సీఐ, ప్రొహిబిషన్ ఎక్సైజ్, వేమూరు

ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర మాదాల సొంతం

మేకల ప్రసాద్



కామ్రేడ్ మాదాల వర్ధంతి సందర్భంగా ప్రదర్శన చేస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు

బాపట్ల: ప్రజా ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన మాదాల నారాయణస్వామి ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకమని న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ పేర్కొన్నారు. కామ్రేడ్ మాదాల నారాయణస్వామి 11వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి చేపట్టిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. సమ సమాజాన్ని నిర్మించే శాస్త్రీయ సోషలిస్ట్ భావజాలానికి మాదాల అంకితమయ్యారని తెలిపారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే అజిత, ఏ శ్రీను, కల్పన, అన్నమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



బాపట్ల: దివ్యాంగులు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్‌లో మార్పు కనిపిస్తుందని ఎంపీఎల్ ఎలిమెంటరీ స్కూలు హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సోమవారం ఎంపీఎల్ ఎలిమెంటరీ స్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్ట్ శ్రీధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.కె.ఆయేషా, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కరుణకుమారి, రమాదేవి ఉన్నారు.

రైతులు ధాన్యం నిల్వ చేసుకోవాలి

చుండూరు(వేమూరు): అల్పపీడన ప్రభావంతో ఈ నెల 11 నుంచి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి బి.ఆదాం బాబు తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని రైతులందరు వరి కోతలు నిలిపి వేయాలని ఆయన సూచించారు. హార్వెస్టర్ ద్వారా కోసిన ధాన్యం జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలని చెప్పారు. నిల్వ చేసుకొనే అవకాశం లేకపోతే అమ్ముకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అందుబాటులో ఉండి తగు సమాచారం తెలుసుకోవాలని ఆయన చెప్పారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

భట్టిప్రోలు: ఈ నెల 11 నుంచి వాయుగుండం ప్రభావం కారణంగా సాధ్యమైనంత వరకు పంట కోతలను 3 రోజులు వాయిదా వేసుకోవాలని భట్టిప్రోలు మండల వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య సోమవారం తెలిపారు. రైతులు అప్రమత్తమై పంట దిగుబడులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని, లేదా రైతు సేవా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావచ్చని పేర్కొన్నారు.

వరి కోతలు నిలిపివేయాలి

చెరుకుపల్లి: ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు నిలిపివేయాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ సోమవారం తెలిపారు. ఏవో మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరి కోతలు ఆపుకోవాలని రైతులకు సూచించారు. అదే విధంగా కోసిన పంటను కుప్పలు వేసుకోవాలని హార్వెస్టర్ ద్వారా కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని తెలిపారు

పార్టీ కార్యకర్తలే సైనికులు



వరివేరు గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకయ్యతో నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): వైఎస్సార్‌సీపీ గెలుపుకు పార్టీ కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. చుండూరు మండలంలోని కారుమూరిపాలెం, పెనుగుదురుపాడు, వలివేరు గ్రామంలో గ్రామ పార్టీ కార్యవర్గం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కారుమూరిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఉయ్యూరి చిన అంజిరెడ్డి, పెనుగుదురుపాడు అధ్యక్షుడిగా వరిటి రంగరావు, వలివేరు అధ్యక్షుడిగా పందిపాటి వెంకయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ చుండూరు మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వారి అరాచకాలను ఎదుర్కోవాలంటే నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. వేమూరు నియోజకవర్గంలో గ్రామ కమిటీల ద్వారా పార్టీని బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. భట్టిప్రోలు మండలంలో గ్రామ కమిటీలు పూర్తి చేయడం జరిగిందని, చుండూరు మండలంలో కూడా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే అన్ని కులాలకు మేలు జరుగుతుందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరలా అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ముందు ఆరు నెలల్లో రోడ్లు వేస్తామన్న చంద్రబాబు, గుంతలు పూడ్చడం జరుగుతుందని చెప్పారు. చంద్రబాబు మోసపూరితమైన పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనపురెడ్డి రాఘవీరారెడ్డి, గ్రామ సర్పంచ్ పందపాటి ఏసోబు, వుయ్యూరి సుబ్బారెడ్డి, వుయ్యూరి అప్పిరెడ్డి, గాదె శివరామ కృష్ణ రెడ్డి, సీనియర్ న్యాయవాది మాజీ ఎంపీటీసీ దాట్ల మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ చిడేపూడి సాంబరెడ్డి, విప్పల వెంకట రామిరెడ్డి, అనపురెడ్డి వీరారెడ్డి, పాల కేంద్రం అధ్యక్షులు ఈమని శ్రీనివాస్ రెడ్డి, తమ్మా రామకృష్ణ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న నాగేశ్వరరావు

తెనాలి: రూరల్ మండల గ్రామం గుడివాడలో డొంక భూములను సాగుచేసుకుంటున్న దళితుల పొలాల్లో పంటకాల్వను తవ్విన అరాచకంపై బాధితుల్లో ఒకరైన రుద్రపాటి నాగేశ్వరరావు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీని దాఖలు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని సబ్ కలెక్టర్ వి.సంజనా సింహకు వివరించారు. గుడివాడ గ్రామ సర్పంచ్ గత ఎన్నికల్లో ఓటు వేయలేదన్న కక్షతో కావాలని తమ పొలాన్ని ధ్వంసం చేసినట్టు ఆరోపించారు. తమ భూమిని పూర్వం ఉన్నట్టుగా చదును చేసి అప్పగించేలా చూడాలనీ, గ్రామ సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. తన తండ్రి దావీదు ప్రభుత్వ భూమి సర్వే నెం.337లో 40 సెంట్ల పొలాన్ని ఎప్పట్నుంచో సాగు చేస్తున్నారని, 1974లో అప్పటి తహసీల్దారు తన తండ్రికి ఆర్‌సీ నెం.72/74 సాగు పట్టాను ఇచ్చినట్టు తెలిపారు. మొత్తంమీద ఇప్పటికి 90 ఏళ్లుగా తమ కుటుంబ సభ్యుల స్వాధీనంలోనే ఉందన్నారు. డొంకరోడ్డు వెడల్పు పేరుతో పంట పొలంలోకి వెళ్లేందుకు వీలులేని విధంగా తవ్వేశారని చెప్పారు. వాస్తవానికి అక్కడున్న డొంక (బండ్లబాట) 20 అడుగుల వెడల్పులో ఉందని, రెండు ట్రాక్టర్లు ఎదురెదురుగా వచ్చినా ఇబ్బంది లేదన్నారు. దళితులమన్న వివక్షతోనే జీవనోపాధిగా ఉన్న పొలాన్ని ధ్వంసం చేశారని, కాళ్లమీద పడి బతిమిలాడినా వినలేదన్నారు. గ్రామంలో తన ఇంటి ముందు రోడ్డుపక్కన చిన్న పశువుల పాకను కూడా తీయమని పంచాయతీ కార్యదర్శిచే నోటీసు ఇప్పించారని, పోలీసులను తీసుకొచ్చి బెదిరిస్తున్నాడని ఆరోపించారు.

మొత్తం ఏడు అర్జీలు...

ఇదిలా ఉంటే సోమవారం సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ నిర్వహించిన పీజీఆర్‌ఎస్ సమావేశానికి మొత్తం ఏడు అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ పరిధిలోనివి రెండు కాగా, మున్సిపాలిటీ, పోలీస్, డీఎల్‌పీఓ, హౌసింగ్, ఎంపీడీఓ పరిధిలోనివి ఒక్కొక్కటి ఉన్నాయి. సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషి చేస్తామని సబ్ కలెక్టర్ వెల్లడించారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



ప్రాథమిక పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కర్లపాలెం: ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు సమ్మెటవారిపాలెం పంచాయతీ పరిధిలోని శీలంవారి పాలెం ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



పెదపులివర్రు గ్రామ నూతన కమిటీతో నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు



సూరేపల్లిలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి రాబోయే కాలంలో పార్టీ విజయ కేతనం ఎగుర వేసేలా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు కోరారు. సోమవారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో నిర్వహించిన గ్రామ పార్టీ నూతన కమిటీ నియామక సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. పెదపులివర్రు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బేతాళ వరకుమార్‌తో పాటు నలుగురు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, నాయకులు కొనకాల శ్రీనివాసరావు, దావూరి నాగమల్లేశ్వరరావు, నీలా రమేష్, బేతాళ సురేష్, బుస్సా రాజారత్నం, గోగినేని మధుసూధనరావు, కనపర్తి నాగరాజు, దున్నా మధు, జల్లి జోషికాంత్, పంచాయతీ వార్డు సభ్యులు నీలా పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

సూరేపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా చిట్టిబాబు

భట్టిప్రోలు మండలం సూరేపల్లి వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ సర్వసభ్య సమావేశం వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బొర్రా శ్రీనివాసరావు (చిట్టిబాబు)తో పాటు నలుగురు ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, ఉప సర్పంచ్ జంగం వాసు, నాయకులు రావు చంద్రశేఖరరావు, మోర్ల సత్యన్నారాయణ(బాబు), గోవర్ధనగిరి పెద బుజ్జి, పడమట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

రేపల్లె రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10, 12, 16, 18 తేదీలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్వోలు, మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న గంగడిపాలెం, పేటేరు, రాజుకాల్వ, బేతపూడి-1, అరవపల్లి, మోళ్లగుంట, 12న బేతపూడి-2, తుమ్మల, పెనుమూడి, సింగుపాలెం, పేటేరు-2, మోర్లవారిపాలెం, 16న కై తేపల్లి, చోడాయపాలెం, నల్లూరునార్త్, కామరాజుగడ్డ నార్త్, పిరాట్లంక, 18న వడ్డీవారిపాలెం, ఉప్పూడి, చాట్రగడ్డ, కారుమూరు, పోటుమెరక, గుడ్డికాయలంక గ్రామాల ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులతో పాటు మండల స్థాయి అధికారులు శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి యంత్రాంగం, సర్పంచ్‌లకు శిక్షణ

కొల్లూరు : ప్రభుత్వ యంత్రాంగం, సర్పంచ్‌లకు ఈ నెల 10 నుంచి 13 వరకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.నరసింహారావు సోమవారం తెలిపారు. స్థానికంగా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు (ఎల్‌ఎస్‌డీజీఎస్)పై నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళ, బుధ వారాలలో సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్‌ఎం, వీఆర్‌ఓ, ఇంజనీరింగ్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌లతోపాటు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు. గురు, శుక్ర వారాలలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయంలో పని చేస్తున్న సోషల్ వెల్ఫేర్, అగ్రికల్చర్, అసిస్టెంట్‌లు, మహిళా పోలీస్, విలేజ్ సర్వేయర్, పంచాయతీ సెక్రటరీలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు కొల్లూరు, పెదలంకలో రెవెన్యూ సదస్సులు

కొల్లూరు : రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మంగళవారం మండలంలోని కొల్లూరు, పెదలంక గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కొల్లూరు రెవెన్యు పరిధిలో సదస్సును ఉదయం 9 నుంచి కొల్లూరు పంచాయతీ కార్యాలయం, పెదలంక రెవెన్యూ పరిధిలోని సదస్సులను ఉదయం 9 నుంచి పెసర్లంక సచివాలయం, మధ్యాహ్నం పెదలంక, గాజుల్లంక పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూ సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారు అర్జీలను అందించి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

నేడు సూరేపల్లిలో రెవెన్యూ సదస్సు

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం జనవరి 7వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సూరేపల్లి, 12వ తేదీ పెదలంక, 17న పెసర్లంక, చింతమోటు, 19న వెల్లటూరు, 21న పెదపులివర్రు, 27న అద్దేపల్లి, ఐలవరం, 28న భట్టిప్రోలు, జనవరి 2న పల్లెకోన, రాచూరు, 4న గొరిగపూడి, 7న కోనేటిపురం, ఆళ్లమూడి గ్రామాల్లో ఈ సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రైతుల సమస్యలకు అర్జీలను స్వీకరించి 2025 ఫిబ్రవరి 22వ తేదీ నాటికి సాధ్యమైనంత మేర పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



మురుగు కాల్వను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, దానిలో భాగంగా పలు రోడ్లను విస్తరిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పాత రత్న టాకీసు వైపు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ శివాజీచౌక్ నుంచి నాయుడు కుండ బిర్యానీ పాయింట్ వరకు 125 మీటర్లు రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. దీని కోసం రూ.25.50 లక్షల నిధులను వెచ్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తోట రఘురామ్, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, టీపీఓ సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు తాడిబోయిన రమేష్, కాంట్రాక్టర్ గోపాలం శివశరత్ బాబు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

తెనాలిఅర్బన్: అధికారులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని, ఆ దిశగా అందరు ప్రయత్నించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 26వ వార్డులో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆమె వెంటనే వాటిని బాగు చేయించాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చెత్త సేకరణలో సమయపాలన పాటించండి

తెనాలిఅర్బన్: పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తను సమయానికి సేకరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి ఆదేశించారు. 3,5,6,37 వార్డులలో సోమవారం ఆయన పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. రోడ్లపై వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన వాటిని ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. త్వరగా తొలగించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.